# జనరల్ స్టడీస్ - పాలిటీ

## గవర్నర్

సాధారణంగా ప్రతి రాష్ట్రానికి ఒక గవర్నర్ ఉంటారు. కానీ 7వ రాజ్యాంగ సవరణ చట్టం (1956) తర్వాత ఒక గవర్నర్‌ను రెండు లేదా అంతకంటే ఎక్కువ రాష్ట్రాలకు కూడా నియమించవచ్చు. గవర్నర్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య వారధిగా, కేంద్ర ప్రభుత్వ ప్రతినిధిగా, రాష్ట్రంలో రాజ్యాంగ పరిరక్షకుడిగా వ్యవహరిస్తారు. దేశ సార్వభౌమత్వం, సమగ్రతలను కాపాడటం కోసం రాజ్యాంగ నిర్మాతలు గవర్నర్ పదవిని ఏర్పాటుచేశారు.

### గవర్నర్ నియామకం

ఏదైనా ఒక రాష్ట్ర గవర్నర్‌ను ప్రధాని నాయకత్వంలోని మంత్రిమండలి సలహాపై రాష్ట్రపతి నియమిస్తారు. రాజ్యాంగ పరిషత్ గవర్నర్ నియామకానికి సంబంధించి 4 ప్రత్యామ్నాయాలను పరిశీలించి చివరకు రాజ్యాంగ పరిషత్ సభ్యుడైన 'రాజేశ్వర ప్రసాద్' ప్రతిపాదనను ఆమోదించింది.

### పదవీ ప్రమాణం

రాజ్యాంగంలోని 159వ నిబంధన ప్రకారం రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి లేదా హైకోర్టులోని అత్యంత సీనియర్ న్యాయమూర్తి సమక్షంలో గవర్నర్ పదవీ ప్రమాణస్వీకారం చేస్తారు.

**గవర్నర్ అధికారాలు, విధులను కింది విధంగా వర్గీకరించవచ్చు.**

#### కార్య నిర్వహణాధికారాలు

రాజ్యాంగంలోని 154వ నిబంధన ప్రకారం రాష్ట్ర ప్రభుత్వ కార్యనిర్వహణాధికారమంతా గవర్నర్‌కు ఉంటుంది. ఈ అధికారాలను స్వయంగా లేదా తన కింది అధికారుల ద్వారా నిర్వహిస్తారు.

i) రాష్ట్ర ముఖ్యమంత్రిని, అతడి సలహాపై మంత్రులను గవర్నర్ నియమిస్తారు. వీరు గవర్నర్ సంతృప్తి మేరకు పదవిలో కొనసాగుతారు. ఝార్ఖండ్, చత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల్లో గవర్నర్ తప్పనిసరిగా షెడ్యూల్డ్ తెగల సంక్షేమ శాఖా మంత్రిని నియమించాలి.

ii) రాష్ట్ర అడ్వకేట్ జనరల్‌ను నియమిస్తారు. వారి జీతభత్యాలను నిర్ణయిస్తారు. అడ్వకేట్ జనరల్ గవర్నర్ సంతృప్తి మేరకు పదవిలో కొనసాగుతారు.

iii) రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధాన అధికారిని నియమిస్తారు. అయితే తొలగించే అధికారం గవర్నర్‌కు లేదు. హైకోర్టు న్యాయమూర్తిని తొలగించే పద్ధతిలోనే తొలగించాల్సి ఉంటుంది.

iv) రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్, సభ్యులను నియమిస్తారు. వీరిని తొలగించే అధికారం గవర్నర్‌కు లేదు, రాష్ట్రపతికి మాత్రమే ఉంది.

v) గవర్నర్ రాష్ట్ర పరిపాలనకు సంబంధించిన సమాచారాన్ని, శాసనసభలో ప్రవేశపెట్టబోయే బిల్లులకు సంబంధించిన సమాచారాన్ని అందించాల్సిందిగా ముఖ్యమంత్రిని కోరవచ్చు.

vi) విశ్వవిద్యాలయాలకు ఛాన్సలర్‌గా వ్యవహరిస్తారు, వైస్-ఛాన్సలర్లను నియమిస్తారు.

vii) రాష్ట్ర ఆర్థికసంఘం ఛైర్మన్, సభ్యులను నియమిస్తారు.

viii) రాష్ట్ర పరిపాలనా వ్యవహారాలపై రాష్ట్రపతికి ఎప్పటికప్పుడు నివేదికలను సమర్పిస్తారు.

ix) రాష్ట్రంలో రాజ్యాంగ అత్యవసర పరిస్థితిని ప్రకటించాల్సిందిగా రాష్ట్రపతిని కోరవచ్చు. రాజ్యాంగ అత్యవసర పరిస్థితి లేదా రాష్ట్రపతి పాలన (356వ నిబంధన) విధిస్తే రాష్ట్రపతి లేదా కేంద్ర ప్రభుత్వ ప్రతినిధిగా విస్తృతమైన కార్యనిర్వహణాధికారాలను గవర్నర్ చెలాయిస్తారు.

x) రాష్ట్ర మానవ హక్కుల కమిషన్, మైనారిటీ కమిషన్, మహిళా కమిషన్, షెడ్యూల్డ్ కులాల కమిషన్, షెడ్యూల్డ్ తెగల కమిషన్, వెనుకబడిన తరగతుల కమిషన్ ఛైర్మన్, సభ్యులను నియమిస్తారు.

**శాసనాధికారాలు**

రాజ్యాంగంలోని 168వ నిబంధన ప్రకారం రాష్ట్ర గవర్నర్ శాసనసభలో అంతర్భాగం. కానీ సభ్యుడు కాదు, ఓటు వేయలేరు. అయితే కింది శాసనాధికారాలు ఉంటాయి.

i) రాష్ట్ర శాసనసభను సమావేశపరచడం, వాయిదా వేయడం, రద్దు చేయడం (174వ నిబంధన).

ii) రాష్ట్ర శాసనసభను ఉద్దేశించి ప్రసంగించగలరు. శాసనసభకు సందేశాలను పంపగలరు (175వ నిబంధన).

iii) 176వ నిబంధన ప్రకారం రాష్ట్ర విధానసభకు సాధారణ లేదా మధ్యంతర ఎన్నికలు జరిగిన తర్వాత, ప్రతి సంవత్సరం శాసనసభ మొదటి సమావేశంలో విధానసభ/ ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగిస్తారు.

iv) 192వ నిబంధన ప్రకారం రాష్ట్ర శాసన సభ్యులను ఎన్నికల సంఘం అభిప్రాయానికి అనుగుణంగా అనర్హులుగా ప్రకటించగలరు.

v) 200వ నిబంధన ప్రకారం రాష్ట్ర శాసనసభ ఆమోదించిన బిల్లును గవర్నర్ ఆమోదిస్తారు లేదా పునః పరిశీలనకు పంపుతారు లేదా రాష్ట్రపతి పరిశీలనకు పంపుతారు. (రాష్ట్ర హైకోర్టు అధికారాలకు సంబంధించి ఏదైనా బిల్లును రాష్ట్ర శాసనసభ ఆమోదిస్తే తప్పక రాష్ట్రపతి ఆమోదం కోసం పంపాలి)

vi) రాష్ట్ర విధానసభ స్పీకర్, డిప్యూటీ స్పీకర్ పదవులు ఖాళీ అయితే విధానసభలో ఒక సభ్యుడిని స్పీకర్‌గా నియమిస్తారు. అదే విధంగా విధాన మండలిలో ఛైర్మన్, డిప్యూటీ ఛైర్మన్ పదవులు ఖాళీగా ఉంటే విధాన మండలి నుంచి ఒకరిని ఛైర్మన్‌గా నియమిస్తారు.

vii) 213వ నిబంధన ప్రకారం ప్రకారం రాష్ట్ర విధానసభ, విధాన మండలి సమావేశంలో లేని కాలంలో 'ఆర్డినెన్స్' జారీ చేస్తారు.

viii) రాష్ట్ర విధానసభలో ఆంగ్లో-ఇండియన్స్‌కు తగిన ప్రాతినిధ్యం లేకపోతే ఆ వర్గం నుంచి ఒకరిని నామినేట్ చేస్తారు.

ix) రాష్ట్ర విధానమండలి మొత్తం సభ్యుల్లో 1/6వ వంతు సభ్యులను నామినేట్ చేస్తారు.

x) రాష్ట్రమంత్రి మండలి సిఫారసుపై విధానసభను రద్దు చేసే అధికారం గవర్నర్‌కు ఉంటుంది.

xi) రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్, రాష్ట్ర ఆర్థిక సంఘం, కాగ్ (CAG) నివేదికలను శాసనసభలో ప్రవేశ పెట్టేలా చూస్తారు.

**ఆర్థిక అధికారాలు**

i) ప్రతి ఆర్థిక సంవత్సరం వార్షిక ఆర్థిక నివేదిక లేదా రాష్ట్ర బడ్జెట్‌ను శాసనసభలో ప్రవేశపెట్టేలా చూస్తారు.

ii) ఆర్థిక బిల్లులను శాసనసభలో ప్రవేశపెట్టడానికి గవర్నర్ ఆమోదం తప్పనిసరిగా పొందాల్సి ఉంటుంది.

iii) గవర్నర్ ఆమోదం లేనిదే కొత్త పన్నులు విధించడం; ఉన్న పన్నులను రద్దు చేయడం, పెంచడం, తగ్గించడం చేయకూడదు.

iv) రాష్ట్ర ఆగంతుక నిధి గవర్నర్ ఆధీనంలో ఉంటుంది. ప్రకృతి లేదా మానవ విపత్తులు సంభవించినప్పుడు ఈ నిధి నుంచి ఖర్చు చేస్తారు.

v) రాష్ట్రంలోని పంచాయతీరాజ్ సంస్థలు, పురపాలక, నగరపాలక సంస్థల ఆర్థిక స్థితిగతులను సమీక్షించి సిఫారసులు చేయడానికి 5 సంవత్సరాలకు ఒకసారి ఆర్థిక సంఘాన్ని నియమిస్తారు.

**న్యాయాధికారాలు**

**గవర్నర్‌కు కింది న్యాయాధికారాలు ఉంటాయి.**

i) రాష్ట్ర కార్యనిర్వహణాధికార పరిధిలో ఉన్న న్యాయస్థానాలు విధించిన శిక్షలను మార్పుచేయవచ్చు (Commutation), తగ్గించవచ్చు (Remission), వాయిదా వేయవచ్చు (Reprieve), క్షమాభిక్ష (Pardon) ప్రసాదించి పూర్తిగా రద్దు చేయవచ్చు. అయితే మరణశిక్షను రద్దు చేసే అధికారం రాష్ట్ర గవర్నర్‌కు లేదు, కేవలం రాష్ట్రపతికి మాత్రమే ఉంది.

ii) రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తుల నియామకంలో రాష్ట్రపతి, రాష్ట్ర గవర్నర్‌ను సంప్రదిస్తారు (217వ నిబంధన).

iii) జిల్లా న్యాయమూర్తులు, ఇతర న్యాయమూర్తులను నియమించే అధికారం గవర్నర్‌కు ఉంది. అంతేకాకుండా వీరి పదోన్నతిని కూడా హైకోర్టుతో సంప్రదించి గవర్నర్ నిర్ణయిస్తారు (233వ నిబంధన).

iv) రాష్ట్ర న్యాయ సర్వీసుల్లో జిల్లా జడ్జీలు కాకుండా ఇతర న్యాయ అధికారులను నియమించడానికి, అవసరమైన నియమ నిబంధనలను రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్, రాష్ట్ర హైకోర్టులను సంప్రదించి రూపొందిస్తారు (234వ నిబంధన).

**విచక్షణాధికారాలు**

రాజ్యాంగబద్ధ పదవుల్లో రాష్ట్ర గవర్నర్‌కు ఉండే విచక్షణాధికారాలు మరెవ్వరికీ లేవు. గవర్నర్‌కు ఉన్న విచక్షణాధికారాలు: 2 రకాలు. అవి: i) స్పష్టమైన లేదా రాజ్యాంగపరమైన విచక్షణాధికారాలు

ii) సందర్భానుసారంగా లభించే విచక్షణాధికారాలు, రాజ్యాంగంలోని 163(2) నిబంధన ప్రకారం మంత్రిమండలి సలహా లేకుండానే కింది అధికారాలను, విధులను నిర్వహిస్తారు.

i) రాష్ట్ర విధానసభ ఎన్నికల తర్వాత ఏ పార్టీకి లేదా సంకీర్ణ కూటమికి మెజారిటీరాని సందర్భంలో గవర్నర్ తన విచక్షణాధికారాలను ఉపయోగించి ఒకరిని ముఖ్యమంత్రిగా నియమించి, మెజారిటీ నిరూపించుకోమని కోరవచ్చు. లేదా కొంతకాలం రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించమని కోరవచ్చు. మారిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో మెజారిటీ పొందగలడని భావించిన వ్యక్తిని ముఖ్యమంత్రిగా నియమించి, విధానసభ విశ్వాసం పొందాల్సిందిగా కోరవచ్చు.

ii) ముఖ్యమంత్రి రాష్ట్ర విధానసభలో మెజారిటీ కోల్పోయినట్లు గవర్నర్ భావిస్తే, విధానసభ విశ్వాసం పొందాలని ముఖ్యమంత్రిని కోరవచ్చు.

iii) విధానసభలో మెజారిటీ కోల్పోయిన ముఖ్యమంత్రి లేదా మంత్రి మండలిని రద్దుచేయగలరు. అంతేకాకుండా అవసరమైతే మరొకరిని నియమించి, మెజారిటీ నిరూపించుకోవలసిందిగా కోరవచ్చు.

iv) మంత్రిమండలి విధానసభలో మెజారిటీ కోల్పోయి, మరొక మంత్రివర్గం ఏర్పాటు చేయడం సాధ్యం కానప్పుడు గవర్నర్ విధానసభను రద్దుచేసి, రాష్ట్రంలో ఎన్నికలు జరిపించాల్సిందిగా రాష్ట్రపతికి సిఫారసు చేయవచ్చు.

v) రాష్ట్రంలో 356వ నిబంధన ప్రకారం రాజ్యాంగ అత్యవసర పరిస్థితి లేదా రాష్ట్రపతి పాలన విధించినప్పుడు ఆ రాష్ట్రాన్ని గవర్నర్ పరిపాలిస్తారు.

vi) రాష్ట్ర శాసనసభ ఆమోదం పొంది, గవర్నర్ ఆమోదం కోసం పంపిన ఏదైనా బిల్లును రాష్ట్రపతి పరిశీలన కోసం పంపగలరు.

vii) ఒక రాష్ట్రానికి గవర్నర్‌గా ఉంటూ, కేంద్రపాలిత ప్రాంతానికి పరిపాలకుడిగా (Administrator) అదనపు బాధ్యతలను నిర్వర్తిస్తున్నప్పుడు గవర్నర్‌కు విచక్షణాధికారాలు ఉంటాయి.

viii) రాష్ట్ర పరిపాలన, రాజకీయ స్థితిగతులపై రాష్ట్రపతికి పంపే నివేదిక గవర్నర్ విచక్షణపై ఆధారపడి ఉంటుంది.

ix) రాష్ట్ర శాసన, పరిపాలన వ్యవహారాలకు సంబంధించి ముఖ్యమంత్రిని సమాచారం ఇవ్వాల్సిందిగా కోరవచ్చు.

x) 6వ షెడ్యూల్‌లో పేర్కొన్న అసోం, మేఘాలయ, త్రిపుర, మిజోరాం రాష్ట్రాల్లోని గిరిజన ప్రాంతాల పరిపాలనపై గవర్నర్‌కు విచక్షణాధికారాలు ఉంటాయి.

★ కింది కొన్ని సందర్భాల్లో రాష్ట్రపతి సూచనలకు అనుగుణంగా గవర్నర్ కొన్ని విధులను నిర్వర్తించాలి. ఈ విషయాలకు సంబంధించి రాష్ట్ర ముఖ్యమంత్రితో సంప్రదించినప్పటికీ అంతిమ నిర్ణయం గవర్నర్‌దే.

ఎ) మహారాష్ట్రలో విదర్భ, మరఠ్వాడా ప్రాంతాలకు ప్రత్యేక అభివృద్ధి బోర్డులను ఏర్పాటు చేయడం.

బి) గుజరాత్‌లో సౌరాష్ట్ర, కచ్ ప్రాంతాలకు ప్రత్యేక అభివృద్ధి బోర్డులను ఏర్పాటు చేయడం.

సి) నాగాలాండ్‌లో శాంతి భద్రతలకు ప్రత్యేక చర్యలు తీసుకోవడం.

డి) అసోంలో షెడ్యూల్డ్ తెగలు, ప్రాంతాల అభివృద్ధి.

ఇ) మణిపూర్‌లో కొండ ప్రాంతాల అభివృద్ధి.

ఎఫ్) సిక్కింలో వివిధ వర్గాల అభివృద్ధి.

జి) అరుణాచల్‌ప్రదేశ్‌లో శాంతి భద్రతలు లాంటి అనేక విషయాల్లో గవర్నర్‌కు విచక్షణాధికారాలు ఉంటాయి.

## జీతభత్యాలు

ప్రస్తుతం గవర్నర్ రూ. 1,10,000 నెలసరి వేతనంగా పొందుతున్నారు. వేతనంతోపాటు ఉచిత అధికార నివాస గృహం (రాజ్‌భవన్), ఇతర సౌకర్యాలను కల్పిస్తారు. రాష్ట్ర గవర్నర్ వేతనాన్ని రాష్ట్ర సంఘటిత నిధి నుంచి చెల్లిస్తారు. గవర్నర్ పదవీకాలంలో ఉండగా వేతనాన్ని తగ్గించకూడదు. వేతనాన్ని పెంచే అధికారం పార్లమెంటుకు ఉంది.

**గవర్నర్ పదవికి రాజ్యాంగ రక్షణలు:**

★ గవర్నర్ తన అధికార, విధి నిర్వహణకు సంబంధించి ఏ న్యాయస్థానానికీ జవాబుదారీ కాదు.

★ గవర్నర్ పదవిలో ఉన్నంతవరకూ క్రిమినల్ కేసులు నమోదు చేసి, అరెస్టు చేయకూడదు.

★ గవర్నర్‌పై సివిల్ కేసు నమోదు చేయాలంటే 2 నెలల ముందుగా నోటీసు ఇవ్వాల్సి ఉంటుంది.

## పదవీకాలం

సాధారణంగా గవర్నర్ పదవీకాలం 5 సంవత్సరాలు. అయితే 156(1) నిబంధన ప్రకారం రాష్ట్రపతి ఇష్టం ఉన్నంత కాలమే అధికారంలో కొనసాగగలరు. ఆచరణలో కేంద్ర ప్రభుత్వం సంతృప్తి చెందినంత కాలం మాత్రమే అధికారంలో కొనసాగగలరు.

★ సుప్రీంకోర్టు 2010, మే 7న బి.పి. సింఘాల్ Vs యూనియన్ ఆఫ్ ఇండియా వివాదంలో తీర్పునిస్తూ గవర్నర్లు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు కాదని, గవర్నర్ పదవి రాజ్యాంగబద్ధ పదవని, కాబట్టి 'విశ్వాసం' కోల్పోయారనే పేరుతో ఏకపక్షంగా తొలగించకూడదని తెలియజేసింది. గవర్నర్‌ను అనైతిక ప్రవర్తన, తీవ్రమైన అవకతవకలు లాంటి కారణాలున్నప్పుడే తొలగించాలని స్పష్టం చేసింది. నిష్పక్షపాతంగా, తగిన కారణాలతో మాత్రమే తొలగించాలని పేర్కొంది.

★ రాష్ట్ర గవర్నర్‌ను ఒక రాష్ట్రం నుంచి మరో రాష్ట్రానికి బదిలీ చేసే అధికారం రాష్ట్రపతికి ఉంది. బదిలీ చేయడానికి నిర్ణీత కాలపరిమితి ఏమీ లేదు.

## అర్హతలు

రాజ్యాంగం ప్రకారం (157 వ నిబంధన) గవర్నర్‌గా నియమితులు కావడానికి రెండు అర్హతలు ఉండాలి. అవి: భారత పౌరుడై ఉండాలి, 35 సంవత్సరాల వయసు నిండి ఉండాలి. వీటితో పాటు రెండు సంప్రదాయాలున్నాయి.

ఎ) ఒక రాష్ట్రానికి చెందిన వ్యక్తిని అదే రాష్ట్రానికి గవర్నర్‌గా నియమించరు.

బి) ఒక రాష్ట్రానికి గవర్నర్‌గా నియమించడానికి ముందు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిని సంప్రదించాలి.

★ అయితే ఈ సంప్రదాయాలను కొన్ని సందర్భాల్లో ఉల్లంఘించారు. ఉదాహరణకు 1951లో హెచ్.సి. ముఖర్జీని పశ్చిమ్ బంగకు, 1965లో కరణ్‌సింగ్‌ను జమ్మూ కశ్మీర్‌కు, 1966లో ఉజ్వల్‌సింగ్‌ను పంజాబ్ రాష్ట్రానికి సొంత రాష్ట్రాలైనప్పటికీ నియమించారు.

❋ భారత రాజకీయాల్లో తరచూ వివాదాస్పదమవుతోన్న రాజ్యాంగబద్ధమైన పదవి 'రాష్ట్ర గవర్నర్'. విచక్షణాధికారాలు ఉండటం, కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీకి చెంది ఉండటం మొదలైన కారణాలు రాజ్యాంగబద్ధమైన ఈ పదవిని రాజకీయం చేస్తున్నాయి. రాష్ట్ర ప్రథమ పౌరుడు, రాష్ట్రానికి రాజ్యాంగాధిపతి అయిన రాష్ట్ర గవర్నర్ గురించి VI భాగంలో 153 – 167 వరకు ఉన్న నిబంధనలు వివరిస్తాయి. అంతేకాకుండా 174, 175, 176, 200, 201, 213, 217, 233, 234 నిబంధనలు కూడా గవర్నర్ అధికారాలు, విధులను తెలియజేస్తాయి.

**రచయిత: డాక్టర్ ఎం. భాస్కర రాజు**

www.eenadupratibha.net